# అందరూ మెచ్చేలా పనిచేస్తా..

- ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గౌడల ఆత్మీయ సమ్మేళనంలో తల్లిదండ్రులను గుర్తు చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్న మంత్రి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న గౌడ నేతలు



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఫ్రూట్ మర్చంట్స్

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 1 : వందేళ్ల చరిత్ర చూసినా అందరూ మెచ్చుకొనేలా పనిచేస్తానని ఎక్సైజ్, క్రీడాశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి సతీ సమేతంగా హాజరవ్వగా వీరికి గౌడ సంఘం నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.3 కోట్ల నిధులతో నిర్మించనున్న గౌడ భవనం పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ పౌరుడిగా జీవనం సాగించి కష్టపడి అంచెలంచెలుగా ఎదిగి మంత్రి స్థాయికి చేరుకొని ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. తన ఎదుగుదలను మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల చూపుతున్న ఆదరాభిమానాలను చూసేందుకు తన తల్లిదండ్రులు ఉంటే ఎంతో సంతోష పడేవారని మంత్రి భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు సాయిలుగౌడ్, శ్రీధర్‌గౌడ్, నారాయణగౌడ్, బాగన్నగౌడ్, రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జంగల్ సఫారీ ప్రారంభం..

వేలాది రకాల పక్షుల సమాహారంగా తీర్చిదిద్దుతున్న బర్డ్స్ ఎన్ క్లోజర్ 26 వేల ఎకరాల్లో జంగల్ సఫారీని రాజసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌తో కలిసి సోమవారం ప్రారంభించనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్వీఎస్ ఎదురుగా ఉన్న నిర్మల్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసి కమ్మ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన సతీసమేతంగా హాజరుకాగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కమ్మ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తిరుమల హిల్స్‌లో స్థలం కేటాయిస్తూ ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు రమణయ్య, కొండ య్య, సుబ్బయ్య, మాల్యాద్రి, నారాయణరావు, బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోట రత్నం, సాయిలీల ఉన్నారు.

### ప్రధానికి తెలంగాణ అంటేనే ద్వేషం..

ప్రధానమంత్రి మోదీ మహబూబ్‌నగర్‌కు వస్తాడు.. పోతాడు కానీ.. ఈ ప్రాంతానికి చేసేంది ఏమీలేదని, ఆయనకు ఈ ప్రాంతమంటేనే ద్వేషమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఇప్పటికే పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా హామీ ఇచ్చి ముచ్చటగా మూడుసార్లు మోసం చేశారని.. మళ్లీ ఈ ప్రాంత ప్రజలను వంచించేందుకు మరోసారి వస్తున్నారని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బీసీ వృత్తిదారులు, మైనార్టీలు ఆర్థికంగా చేయూతనివ్వడానికి వందశాతం సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయానికి సంబంధించిన చెక్కులను 34 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎసీ,ఎస్టీ,బీసీ మైనారిటీల్లోని పేద ప్రజలందరికీ వివిధ పథకాల ద్వారా తమ ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. బీసీ ప్రధానమంత్రి అయినా బీసీలకు మోదీ చేసిందేమీలేదన్నారు. తాము నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి అభివృద్ధి సంక్షేమం కోసం కష్టపడుతున్నామని... కానీ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజల మధ్యకు వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు మాటలు విని మోసపోవద్దని మంత్రి ప్రజలకు హితవు పలికారు.

### ప్రతిఒక్కరి సంక్షేమానికి కృషి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 1 : ప్రజలకు మంచి చేయాలనే తపనతో మీరు బీఆర్‌ఎస్ పార్టీలోకి వస్తున్నారని మీ నమ్మకం రెట్టింపు అయ్యేలా ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం కృషి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఫ్రూట్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ నిసార్, ఉపాధ్యక్షులు మహ్మద్ షాహీద్, మధుసూదన్, అమీర్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌తోపాటు 200 మందికి పైగా వ్యాపారులు బీఆర్‌ఎస్ పట్టణ మైనార్టీ కార్యదర్శి ఇమ్రాన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అదేవిధంగా పట్టణానికి చెందిన సామజిక కార్యకర్త తయ్యాబ్ బష్వార్, నాయకులు అబ్దుల్ సన్ని, అబ్దుల్ హకీం, లతీఫ్, జుబేర్, మహమ్మద్, హసన్‌తోపాటు మరో 100మందికి పైగా బీఆర్‌ఎస్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో చేరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి బుద్ధ భవన్ సమీపంలో రూ.20లక్షలతో చేపట్టిన సెర్ప్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు.

### సుందరపట్టణంగా మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 1 : సుందరపట్టణంగా మహబూబ్‌నగర్‌ను తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 24,32, 33,37,38,42,43,45,48వవార్డులో రూ.9 కోట్ల 50లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు పట్టణాభివృద్ధి పట్టించుకోలేదని, వార్డులో సమస్యలు, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత తమ ప్రభుత్వం హయాంలో శరవేగంగా అభివృద్ధి జరిగిందన్నారు. పట్టణ రోడ్ల విస్తరణ, ప్రధాన రోడ్లు, బైపాస్ రోడ్లు, జంక్షన్ల సుందరీకరణ, పార్కులు ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ గువ్వల బాలరాజు

# ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, అచ్చంపేట గువ్వల బాలరాజు
- ఆలయ నిర్మాణాలకు రూ.కోటి 26 లక్షల ప్రొసీడింగ్స్

ఉప్పునుంతల, అక్టోబర్ 1: తన కంఠంలో ప్రాణమున్నంత వరకు అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఉప్పునుంతలకు చెందిన వివిధ కులాలకు చెందిన ఆలయాల నిర్మాణానికి రూ.కోటి 26లక్షల ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన అచ్చంపేటను జీవితంలో మర్చిపోనని, నియోజకవర్గం అభివృద్ధే తన ఆశయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అచ్చంపేట ప్రాంతాన్ని నిండుకుండలా మా ర్చేందుకు రూ.2,300 కోట్లతో ఉమామహేశ్వర, చెన్నకేశవ, నిరంజన్‌షావలి, మ ద్దిమడుగు అంజన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే అచ్చంపేట ప్రాంతం పూర్తిగా సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే భయపడే ప్రసక్తేలేదని ప్రజల మధ్య ఉన్న నన్ను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో మతాల పేరిట ఒక పార్టీ, మాయమాటలతో మరో పార్టీ వస్తుందని, వారి మాయమాటలకు మోసపోవద్దని, మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ గోపాల్‌రెడ్డి, సర్పంచులు అనంతాఇంద్రాసేనారెడ్డి, పర్వతాలు, బాలునాయక్, శివ, ఎంపీటీసీ మల్లేశ్‌యాదవ్‌తోపాటు బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.



యువతీ యువకులకు డ్రైవింగ్ లైసెన్సులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# 24 గంటల కరెంట్ ఇచ్చే దమ్మున్న నేత సీఎం కేసీఆర్

- జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, అక్టోబర్ 1 : దేశంలోనే నిరంతరం 24గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా ఇచ్చే దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు సీఎం కేసీఆర్ ఒక్కరే అని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. సీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జడ్చర్లలోని చంద్రగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రాజకీయాలు, సామాజికపరమైన అంశాలపై యువతీ, యువకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉండేదని చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, కరెంటు, రోడ్లు లేక దుర్భరపరిస్థితి ఉండేదన్నారు. కనీసం తాగునీరు, కరెంట్ ఇవ్వటం చేతగానీ ముఖ్యమంత్రులు పనిచేశారని విమర్శించారు. గత ప్రభుత్వాలు సరిగా పనిచేయకపోవటంతో ప్రజల ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నదన్నారు. అందుకే ప్రతిఒక్కరూ పని చేసే ప్రభుత్వానికి అండగా నిలబడాలని, మరోసారి సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. అనంతరం యువతీ యువలకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి, రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, బాదేపల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మురళి, కౌన్సిలర్లు సతీశ్, ప్రశాంత్‌రెడ్డి, రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, కొంగళి జంగయ్య, రాంమోహన్, నాగిరెడ్డి, ఇంతియాజ్, శ్రీకాంత్, పర్వత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రైలు ప్రారంభిస్తున్న అధికారులతో ఎమ్మెల్యే చిట్టెం

# రైలు ప్రయాణం సులభతరం

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణ/మక్తల్ టౌన్, అక్టోబర్ 1 : మక్తల్ నియోజకవర్గ ప్రజలకు రైలు ప్రయాణం సులభతరమైందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మునీరాబాదు – కృష్ణ రైల్వే లైన్ పూర్తయిన సందర్భంగా మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ జంక్షన్ నుంచి కృష్ణ – కాచిగూడ డెమో ప్యాసింజర్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నా యకులతో కలిసి కృష్ణ నుంచి మక్తల్ వరకు రైలు లో ప్రయాణించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ మక్తల్ వాసుల చిరకాల వాంఛ ఇప్పుడు సాకారమైందన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మక్తల్, మాగనూర్ బీఆర్‌ఎస్ నాయకులు, కార్య కర్తలు, రైల్వేశాఖ అధికారులు ఉన్నారు.

# పనిచేసే ప్రభుత్వానికి మీ ఆశీస్సులు ఉండాలి

- వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- హైదరాబాద్‌లో వనపర్తివాసుల ఆత్మీయ సమ్మేళనం



మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న గిరిజన మహిళ

వనపర్తి, అక్టోబర్ 1: తెలంగాణ కోసం పోరాడి సాధించిన, అన్ని వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వానికి మీ ఆశీస్సులు ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్లాటినం హైట్స్‌లో హైదరాబాద్‌లో నివసిస్తున్న 2,500 మంది వనపర్తి వాసుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కొనసాగించేలాంటే సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఐదేండ్లకోసారి వచ్చే కాంగ్రెసోల్లు సంక్రాంతి గంగిరెద్దులలాంటి వారని, వారి చెప్పే హామీలను నమ్మి ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారంలోకి వెళ్లిపోతుందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారన్నారు. గతంలో జిల్లాలోని పల్లెల నుంచి పట్టణ, ఇతర రాష్ట్రాలకు వలసులుండేవని.. నేడు ఆగి.. తిరిగి వాళ్ల గ్రామాలకు వస్తున్నారని, ఒకప్పుడు మాదిరిగా గ్రామాలు కాల్వలలో సాగునీరు పారడంతో పచ్చని పంటలు వెల్లువిరుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో స్థిరపడ వారంతా తెలంగాణ వచ్చిన తరువాత గ్రామాల్లో వచ్చిన మార్పులను గుర్తించాలని సూచించారు. ఒకప్పుడు తాగునీరు లేక తల్లడిల్లిన స్థితి నుంచి నేడు మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా నీటిని అందిస్తామన్నారు. తొమ్మిదేండ్ల కాలంలో వనపర్తి జిల్లాగా అయిందని, దానికి తగ్గట్టుగా సీఎం కేసిఆర్ ఆశీస్సులతో అనేక పథకాలను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఒకప్పుడు వనపర్తిలో డిగ్రీ సీటు దొరకక ఒక ఏడాది చదువులు ఆగిపోయిన సందర్భాలు చాలా ఉండేవని, వచ్చిన ఇంజినీరింగ్ కళాశాలను నిలుపుకొలేని నాయకులు మన ప్రాంతాన్ని పరిపాలించారని ఎద్దేవా చేశారు. నేడు వనపర్తికి మెడికల్, నర్సింగ్, ఇంజినీరింగ్, వ్యవసాయ, మత్స్య కళాశాలను ఏర్పాటు చేసుకొవడమే కాక ఐటీ హబ్ టవర్ ఏర్పాటుకు శంకుస్థాపనలు కూడా చేసుకున్నామన్నారు. ఉన్నత చదువులకు దూరంగా వెళ్లి భారమైన చదువులకు ఇబ్బంది లేకుండా మన ప్రాంతంలోనే గొప్పగా చదువుకొనే స్థితికి తీసుకొచ్చామన్నారు. పట్టణ కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా పట్టణం అద్భుతంగా రూపుదిద్దుకుంటుందన్నారు. పట్టణ కేంద్రంలోని నలువైపులా ఉన్న చెరువు కట్టలను సుందరీకరణ చేసుకొని ట్యాంక్ బండ్‌ను ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని వనపర్తి నివాస ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.